# అటునుంచే ఇటు!

ఘోరమైన తిండితినేసి బాగా నిద్రపోతున్న ఏనుగులా వుంది కాలం. ఎన్నిసార్లు డ్రాఫ్టింగ్ చేసినాసరే, ఎన్నిసార్లు 'క్వెరీ'లకి 'వివరణ' పడేసినా సరే, ఎన్ని పెండింగ్ ఫైలు కాయితాలు ఉద్ధరించినా సరే, "సర్లేవయ్యా-ఊ" అని "థాంక్స్"కి పర్యాయంగా మా ఆఫీసరుగారు (గాడు) అనొచ్చుగదా- అనడు....ఎందుకంటాడూ? ఈ సమస్త క్లర్కు-లంతా దొంగ వెధవలనీ. కొరివిదయ్యాలవడానికి బదులు ఆఫీసులో అవతరించిన సగం గాడిద, సగం పిశాచ రూపం గలవారని ఆఫీసరుగారి నిర్ధారణ. రోజుకి ఎనిమిది గంటలపాటు సమస్త తప్పులు చెయ్యడంకోసం పుట్టిన ఈ మూకని ఉద్ధరించే నిమిత్తం ప్రభుత్వావతారం ఎత్తిన పురాణ పురుషుడినని ఆయన భావన.

"ఏవండీ— ఇలాగేనా నోట్ పుటప్ చేయడం? ఎవరండీ మిమ్మల్ని కాలేజీ దాటించిన వాడు?... అహ్హ... నేను ఆర్కీ-ఐం డివిజన్లో పన్లే సేటప్పుడు ఇలాటివి చదివ్తినా.... ఝు....ఝు.. కాసిని నీళ్ళు తేవయ్యా రాములూ....ట్రింగ్....ట్రింగ్... నో....ఐ నెవర్ స్పాయిల్డ్ ఎరికార్డ్....నీళ్ళు తేడేవీ, ఆ పూలు?.... యుకెన్‌గో....నాశ నయ్యావండీ ఇలారాస్తే...అ....ఇకపై ఇలా రాయద్దు.... అని బాణం తగిలిన పులిలా గాండ్రించాడు.

పులిని చూసిన జింకలా తలాడించాను.

"నా...గో...గో...వెళ్ళండి"

అని ఆయన నన్ను- జింకని తినేసి దాని ఎముకలు బయటకి పారేసిన ఇందాకటి పుల్లాగే చూసేరు.

o o o

దరిద్రావతారపు బస్సులో కూరుకుపోయాను. ఇంటికి ఫర్లాంగు ఇవతల విదిల్చబడ్డట్టు పడినడిచాను. ఏదో మింగడానికి అలివిగాని డాగుపడ్డ కాయలా వుంది నా నోరు. చేతి సంచీలో "అన్నం డబ్బా" నా పొంటుకి మజ్జిగ మరకచేసి పెట్టింది.... పైగా అసుద్ధం మీద కాలేసినట్టుంది ఈ చెప్పుల జత....ప్రతి సాయంత్రం నాకిలాగే అనిపిస్తుంది. నిజానికి ఉదయం పూటా అంతే. పిల్లది ఐస్‌క్రీంలా టూత్‌పేస్ట్‌తినే స్తోంటే కిరాణా కొట్టువాడు నా జేబుదింపినంత బాధ. పావుగంట ముందుగా బయలుదేరినా పావుగంట ఆలస్యంగా చేరే దూరపు ఆఫీసు. వెళ్ళగానే కొంపలు మునిగే క్వెరీ ఫైలు తయారు.... జిడ్డు మొహం రాములు గిరవాటేసినట్టు పడేసిన టీ నా గొంతులోకి ఒలకబోసుకోడం, ఇక.... కోటేశ్వర్రావు, రంగనాధ్, రిసెప్షనిష్టు దెయ్యం క్రికెట్ సంభాషణ.... అదే జీతాలు పడేసే రోజయితే ఎకౌంటెంటు శ్రీ అంబలి దానం చేస్తున్నట్టు ఫోజు పెడుతుంది.

సరిగ్గా అప్పుడే నాకు చెడ్డ చిరాకొస్తుంది (చిరాకులు ప్రభుత్వాలనీ, జీవితాలనీ మార్చగలవా?) ఐతే వెంటనే మాత్రం నాకు వాచంటిది గుర్తొస్తుంది ఆఫీసులో (మరే.మరి. పిల్లికి చేతులుండవాడాడీ?) ఐతే ఇప్పటి కధవేరు.... నా చికాకు వేరు.

ఐదులీటర్ల కిరసనాయిలు, ఒక సబ్బు, తువ్వాలు, షీకాయపొడి, పావుపేకెట్ కాఫీపొడుం (సగం సుధాకరం మిసెస్‌కి బదులిచ్చేయాలిట) ఇవన్నీ నా దగ్గరున్న ఎనిమిది రూపాయల ఇరవై పైసలకి రావుగదా... నోటాచా అప్పడిగితే సరే అన్న పెద్దమనిషి నారాయణమూర్తి. అతను నాలుగున్నరకే ఆఫీసు విడిచివెళ్ళిపోయాడు. పోనీ వెంటబడదామంటే ఆఫీసరు వదుల్తాడా నన్ను!! చంపుకు తిన్నాడు. రేపూ ఎల్లుండి ఆఫీసు శెలవు అతగాడు రూంలో దొరకడు.... ఏదీ దారి?

...ఎలాగో రోడ్డుదాటి ఇవతలకొస్తోంటే తలనొప్పి ఆరంభమైంది. ప్లాస్టిక్ రైలు నా కాళ్ళకింద ఫట్‌మంది.

తారాస్థాయికి చేరేను....

"వెధవ దరిద్రగొట్టు కొంపానీ..ఈ ముండ బొమ్మ ఇక్కడ ఎవరు పెట్టేరు?...మనుషులొస్తారని తెలీదూ!....ష్.... తల పగులుతోంటే కాఫీ ఇవ్వాలని తెలీదు....చీకట్లోనే సింగారించుకోవాలి?" అని అంటున్న సమయంలో మా ఆవిడ జెడఅల్లుకుంటూ, బొడ్లోదువ్వెనదోపి, నోట్లోజెడపిన్ను బిగపట్టి, నేల మీద పడ్డనూనెచుక్కని కాలుతో రాసేస్తూ నన్ను చూసి, నావేపువచ్చింది. అరచేతిలో గుండుసూది దిగబడ్డట్టు చూసింది..

"ఏం చెయ్యనండీ....మీకు తలనొప్పిగా వుందని నాకెలా తెలుసుచెప్పండి... మీరు రావడ..."

"సరే అఘోరించావుగా....ఈ కొంపలో ఎవరికీ ఏదీ తెలీదు....చెప్పుకుని తగలడ్డానికి నేనేడిచాగా ఇక్కడ!!....కాఫీ పడెయ్యి నా మొహాన"

"ఎందుకండీ అంత చిరాకు! నేనేవన్నానని?"

"సరే.... ఇహ నా బతుక్కి- నువ్వు కూడా అనే దాకా పడుండాల్సిందే!.... సరే లేవమ్మా నీకే గొప్పసహనంవుంది.... నేనే తిక్క పీనుగుని...."

"నాఖర్మ నేనే నన్నాతప్పే... పోనీ అమృతాంజనంతేనా?"

"ఏదో ఓటిచూడు ... ఐనా ప్లాస్టిక్ బొమ్మ ఇక్కడ పెట్టిందెవరూ? పడితే ఏం గావాలినేను?"

"నేనేం పెట్టలేదు...పిల్లదే అలా పడేసుంటుంది. మీరు...."

"పిల్లది పడేస్తే పెద్దాళ్ళు తియ్యొచ్చుగా- వొళ్ళు అలిసిపోతుందా?- చెయ్యూ్యరుకోదా?"

"మనం దాచేస్తే అదూరుకుంటుందా చెప్పండి. పైగా దాని ఏడుపు...."

"ఐతే- నాకా మాత్రంపిల్లదాని సంగతి తెలీదా?"

"తెలీదన్నానా?"

"నీ ఉద్దేశం అదేగా- ఈ రేగేదద్దమ్మనీ, నాకు సంసారంసంగతి తెలీదనేగా నీఉద్దే."

— శివాజీ

"ఛి...నాకలాటి ఉద్దేశాల్లేవు"

"మరే- లేదు.... నేనేతోచక- వెధవని కల్పిస్తుంటాను...వనాపాటా ?"

"ఒకటంటే ఒకటి పట్టుకుంటారేం ఇప్పుడే వయిందనీ ?"

"అంటే ఏదైనా జరిగితేగాని ఎవరూ పట్టించుకోకండి .... ఆహా ఏం బుద్ధు లొచ్చాయి !"

"ప్చ్....మీతో వాదించలేను.... వంట తగలడుతోంది- వెళ్ళాలి"

"అవునవును, అన్నిటికి నేనే అడ్డు- నీ వంటకి, నీ పిల్లలకి, నీ ముచ్చటకి.... ఛీ వెధవ బతుకు ఏలాటి గుద్దేసి పుణ్యం కట్టుకున్నా...."

"ఛీ- ఏం మాటలండీ"

ఉన్నట్టుండి కరంటు వచ్చింది. వెలుగులో నిశ్శబ్దంగా ఏడుస్తోంది నా భార్య. పిల్లలు బిక్కు-బిక్కు- మంటూ ఆవిడ చుట్టూ చేరేరు. నేను లేచి స్నానం చేసొచ్చాను... కాఫీ తాగేను- అమృతాంజనం రాసుకుని పడక్కుర్చీలో వాలేను. నాభార్య నింపాదిగా నా దగ్గిరి కొచ్చింది. లంకణం చేసినరోగిలా నీరసంగా "మధ్యాన్నం పప్పు మిగిలింది- చారు కాచావా వంటలోకి ?" అనడిగింది.

"ఊ" అన్నాన్నేను.

అంతా నిశ్శబ్దం... తలనొప్పి తగ్గింది.... సిగరెట్ అంటించాను....పిల్లది ధైర్యంచేసి నా పొట్టమీద కూర్చుంది....నా పొట్టమీదే నిద్దరోయింది.

తొమ్మిదింటికి నేనూ ఆవిడా అన్నం తిన్నాం. ఓ సారి నా మొహంకేసి చూసి ఆవిడ మెల్లిగా అడిగింది....



"ఏవండీ...నారాయణమూర్తి గార్నడిగి డబ్బుతెచ్చి సరుకులు కొంటానన్నారు."

"పోనీ ఎల్లుండి తరవాత కొనద్దాం.... చేతి దాకావొచ్చి అందలేదు...."

"మీ ఇష్టం...."

"ఏవిటో....పైసా పుట్టకపోగా గంపెడు కోపం ,ఇందాకా స్టుపిడ్లా వాగేను....ఏవనుకోకు. ఇద్దరికిద్దరం సరిపోయాం" అన్నాను.

"మీ జేబులో ఒక్క-పొడి వుందాండి ?" అంటోందావిడ...

నా కంటి తడితోనే కునుకుపడుతోంది..

*